
దెయ్యాల వేటగాడు

బెంగాలీ జానపద కథ






దెయ్యాల వేటగాడు



బెంగాలీ జానపద కథ




బెంగాల్‌లో ఒక చిన్న ఊరిలో ఒక మంగలి ఉండేవాడు. అతడికి తన పని అంటే చాలా ఇష్టం. జుట్టు కత్తిరించేటప్పుడు, గెడ్డం చేసేటప్పుడు అతడు ఆసక్తికరమైన కథలు చెబుతూ ఉండేవాడు. ఎవరైనా తమ కష్టాలు చెప్పుకుంటే అతడి దగ్గరి నుంచి మంగలి డబ్బులు తీసుకునేవాడు కాదు, “వీటి అవసరం నీకే ఎక్కువ ఉంది, నువ్వే ఉంచుకో," అనేవాడు. దాంతో అతడు చాలాసార్లు ఉత్తి చేతులతో ఇంటికి వెళ్లేవాడు.




అతడి జాలి గుండె మంగలి భార్యకి నచ్చేది కాదు. అతడి ప్రవర్తనతో చివరికి ఆమె విసిగిపోయింది. ఒక రోజు ఆమె భర్తతో, “ఇంట్లో తినటానికి కూడా ఏమీ ఉండటం లేదు. నీ మంచితనంతో ఇంటి అవసరాలు కూడా పట్టించుకోవటం లేదు," అంది.

తరవాత అతడి సామాను చేతిలో పెడుతూ, “డబ్బులు లేకుండా ఇంటికి తిరిగి రావద్దు," అని చెప్పింది.



దాంతో మంగలి మరో ఊరికి వెళ్లాలని అనుకున్నాడు. తెలియని వాళ్ల నుంచి డబ్బులు తీసుకో గలుగుతానని అతడికి అనిపించింది. తన సామాను తీసుకుని దూరంగా ఉండే ఊరికి ప్రయాణం అయ్యాడు. రాత్రి అయ్యేసరికి ఒక మర్రి చెట్టు దగ్గరకి చేరుకున్నాడు. ఆ రాత్రి అక్కడ గడపాలని అనుకున్నాడు.



అయితే, ఆ మర్రి చెట్టు మీద ఒక పిల్ల దెయ్యం ఉంటోంది. మంగలి పెద్దగా గురకలు పెట్టి నిద్రపోతుండగా ఆ పిల్ల దెయ్యం కిందకి వచ్చి పెద్దగా నవ్వుతూ, సంతోషంతో అరవసాగింది,"హ్హా హ్హా హ్హా! ఈ రాత్రికి నాకు పసందైన విందు దొరికింది."
పిల్ల దెయ్యం వేస్తున్న కేకలకు మంగలికి మెలకువ వచ్చింది.





మంగలి చాలా భయపడి పోయాడు. కానీ, అంత భయంలోనూ అతడు తన సమయస్ఫూర్తిని కోల్పోలేదు. అతడు కూడా పెద్దగా నవ్వటం మొదలు పెట్టాడు, “హ్హా హ్హా హ్హా! నిన్ను చూసి భయపడతానని అనుకున్నావా, నేను దెయ్యాలను పట్టుకునే వాడిని!"


అంటూ మంగలి తన సంచి లోంచి అద్దాన్ని బయటకు తీశాడు. దానిని పిల్ల దెయ్యం ముఖం ముందు పెట్టి, “చూడు, ఈ భయంకరమైన దెయ్యాన్ని ఇప్పుడే పట్టుకున్నాను. నిన్ను కూడా పట్టుకుని నా సంచిలో వేసుకుంటాను. పారిపోటానికి ప్రయత్నించినా ప్రయోజనం లేదు. ఎక్కడ ఉన్నా నిన్ను పట్టుకుంటాను," అన్నాడు.

అంతకు ముందు ఎప్పుడూ ఆ పిల్ల దెయ్యం అద్దాన్ని చూడలేదు. అందుకే అది తన ముఖాన్ని గుర్తించ లేకపోయింది. “అయ్యా, నువ్వు ఏది చెపితే అది చేస్తాను. నన్ను మాత్రం ఆ భయంకరమైన దెయ్యం తోపాటు ఆ సంచిలో వెయ్యవద్దు," అని బతిమాలింది.

“సరే," జాలి పడినట్టు మంగలి నటించాడు. “ఈ రాత్రికి నేను ఈ చెట్టు కింద పడుకుంటాను. తెల్లారే సరికి నాకు వెయ్యి బంగారు నాణాలు తీసుకొచ్చి ఇస్తే, నిన్ను పట్టుకోకుండా వదిలిపెడతాను."

మంగలి సంచిని ఒక్కసారి చూసి ఆ పిల్ల దెయ్యం అక్కడి నుంచి మాయమైపోయింది.





మంగలి లేచేసరికి కుండెడు బంగారు నాణాలతో పిల్ల దెయ్యం సిద్ధంగా ఉంది.

“మంచి పని చేశావు," మంగలి అన్నాడు. “మా ఇంటి దగ్గర రేపటికల్లా పెద్ద గోదాము కట్టి, దాని నిండా బియ్యపు సంచులు నింపు. అప్పుడే నిన్ను పూర్తిగా విముక్తం చేస్తాను."

“రేపటికల్లా ఈ పని చెయ్యటం సాధ్యం కాదేమో," గడగడా వణుకుతూ పిల్ల దెయ్యం చెప్పింది.


“నా ఆజ్ఞని పాటించకపోతే నిన్ను జీవితాంతం ఈ సంచిలో బందీని చేస్తాను."

దాంతో పిల్ల దెయ్యం గట్టిగా ఊపిరి తీసుకుని అక్కడినుంచి మాయమయ్యింది.



ఇంటికి తిరిగి వచ్చిన మంగలి కుండ నిండా ఉన్న బంగారు నాణాలను భార్యకి చూపించాడు. పిల్ల దెయ్యం గురించి ఆమెకు మొత్తం చెప్పాడు. “నీ తెలివితేటలకు మురిసిపోతున్నాను," మంగలి భార్య సంతోషపడుతూ చెప్పింది. “ఇక మన కష్టాలు గట్టెక్కినట్టే.”





ఆ రోజు అంతా పిల్ల దెయ్యం కష్టపడుతూనే ఉంది. ముందు గోదాము కట్టింది. తరవాత బియ్యం బస్తాలు తెచ్చి దాని నిండా నింపసాగింది.

పిల్ల దెయ్యం ఆ విధంగా కష్టపడుతూ ఉంటే, ఒక పెద్ద దెయ్యం ఎగురుకుంటూ అక్కడికి వచ్చింది. పిల్ల దెయ్యం అంతగా కష్టపడటం పెద్ద దెయ్యం అంతకు ముందు ఎప్పుడూ చూడలేదు.

"ఏం చేస్తున్నావు?" అంటూ పెద్ద దెయ్యం అరిచింది.



"ఈ ఇంటిలో చాలా శక్తులు ఉన్న మనిషి ఉన్నాడు. అతడు దెయ్యాలను తేలికగా పట్టేస్తాడు. ఈ రాత్రికి ఈ పని పూర్తి చెయ్యకపోతే అతడి సంచిలో నన్ను శాశ్వతంగా బంధిస్తాడు. ఇప్పటికే అతడి సంచిలో ఒక భయంకరమైన దెయ్యం అతడి బందీగా ఉంది," అంటూ పిల్ల దెయ్యం గుసగుసగా చెప్పింది.

పిల్ల దెయ్యం చెప్పిన మాటలు విని పెద్ద దెయ్యానికి కోపం వచ్చింది. "మనుషుల శక్తులు ఏవీ మన మీద పని చెయ్యవని నీకు తెలియదా? నాతో పాటు రా. అతడికి చక్కని గుణపాఠం నేర్పిద్దాం. ఇకనుంచీ దెయ్యాలను గౌరవించటం అతడు నేర్చుకుంటాడు."




ఆ తరవాత రెండు దెయ్యాలూ మంగలి ఇంటికి వెళ్లి కిటికీ లోంచి తొంగి చూశాయి.

అప్పుడు పెద్ద దెయ్యం, “హ్హా హ్హా హ్హా!" అంటూ పెద్దగా నవ్వింది.
“ఈ రోజు ఇతడిని నేను తినేస్తాను!
పిల్ల దెయ్యం, వీడిని మనిద్దరం కలిసి తినే ం!
తినటానికి ముందు ఇతడిని నిప్పులు మీద కాలిస్తే ఇంకా బాగుంటుంది."

అయితే మంగలి ముఖంలో ఆందోళన గానీ, విచారం గానీ కనపడకపోవటంతో పెద్ద దెయ్యం ఆశ్చర్యపోయింది.

అప్పుడు పిల్ల దెయ్యంతో మంగలి ఇలా అన్నాడు, “నా మాట విని నువ్వు పని చేశావు కాబట్టి ఇప్పుడు నిన్ను వదిలి పెట్టేస్తున్నాను."
తరవాత పెద్ద దెయ్యం వైపు కోపంగా చూస్తూ ఇలా అన్నాడు, “పిల్ల దెయ్యానికి బదులు ఈ సంచిలో నిన్ను బంధిస్తాను."



అది విన్న పెద్ద దెయ్యానికి చాలా కోపం వచ్చింది.
“ఒక దెయ్యంతో ఇలా మాట్లాడటానికి నీకు ఎంత ధైర్యం?" అంటూ అరిచింది.
అప్పుడు మంగలి తన పెద్ద అద్దాన్ని పెద్ద దెయ్యం ముందు పెట్టాడు.
“ఈ దెయ్యంతో జీవితాంతం గడపాలని ఉందా?" అంటూ మంగలి అరిచాడు.





పిల్ల దెయ్యం కంటే పెద్ద దెయ్యం తెలివైనది ఏమీ కాదు.

“దొరా, నువ్వు ఏమైనా చెయ్యి. కానీ, ఆ భయంకరమైన దెయ్యంతో పాటు నన్ను ఆ సంచిలో బంధించవద్దు. నీకు నేను రెండు వేల బంగారు నాణాలు ఇస్తాను. ఇంత కంటే పెద్ద గోదాము కట్టి దాంట్లో బియ్యపు సంచులు నింపుతాను."

“అలా చేస్తే నిన్ను వదిలిపెడతాను," అన్నాడు మంగలి.

ఆ పనులన్నింటినీ పెద్ద దెయ్యం చేసింది. ఆ తరవాత పెద్ద దెయ్యం, పిల్ల దెయ్యం వెనక్కి తిరిగి చూడకుండా అక్కడినుంచి పారిపోయాయి.



అప్పటినుంచి జుత్తు కత్తిరిస్తూ, గెడ్డం చేస్తూ ఆసక్తికరమైన కథలు చెబుతూ మంగలి సంతోషంగా రోజులు గడిపాడు. అవసరమైన వాళ్లకి మనసారా సాయం చెయ్యగలుగుతున్నందుకు అతడికి మరింత సంతోషంగా ఉంది.

